క్లుప్తంగా

రేపు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలోని సాయిబాలాజీ నగరంలో ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు బాలాజీ తెలిపారు. ఉదయం 5 గంటలకు భూపాలి, కాగడ హారతి, అభిషేకం, 8 గంటలకు యాగశాలలో శ్రీభక్తాంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో కీర్తనల పారాయణం ఉంటుందని తెలిపారు. మధ్యాహ్నం హారతి నిర్వహిస్తామని తెలిపారు. భక్తులకు అన్నదానం చేస్తామని, ఈ కార్యక్రమానికి వైఎస్ మాధవరాజు ఉభయదారులుగా వ్యవహరిస్తారని చెప్పారు.

అర్హులందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు


మాట్లాడుతున్న తహశీల్దార్ జరీనా

వడమాలపేట (పుత్తూరు): అర్హులైన ప్రతి ఒక్కరికీ క్యూఆర్ కోడ్ ఆధారిత రేషన్ స్మార్ట్ కార్డులను అందజేస్తున్నట్లు తహశీల్దార్ జరీనా తెలిపారు. ఆదివారం రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 35 చౌకదుకాణాల పరిధిలో 9,611 కార్డుదారులు ఉన్నారని, ప్రస్తుతం 9,506 స్మార్ట్ కార్డులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండు రోజుల్లో స్మార్ట్ కార్డులు అందరికీ అందజేయాలని అధికారులను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


అలేఖ్య

వడమాలపేట (పుత్తూరు): వడమాలపేట మండల పరిధిలోని కదిరిమంగళం బైపాస్ రోడ్డులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు.. వడమాలపేట ఆదిఆంధ్ర వాడకు చెందిన వేణుగోపాల్(45), అలేఖ్య(35) తిరుపతి నుంచి గ్రామానికి మోటర్ సైకిల్‌పై వస్తుండగా చెన్నై నుంచి తిరుపతికి వెళ్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వేణుగోపాల్, అలేఖ్యకు కాళ్లు విరిగిపోయాయి. వీరిని తిరుపతి రుయాకు తరలించారు. ఈ మేరకు ఎస్ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చవితి పండగలో అల్లర్లు వద్దు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వినాయక చవితి పండుగలో అల్లర్లు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని డీఎస్పీ సాయినాథ్ సూచించారు. చిత్తూరు నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం గణేష్ ఉత్సవ సమితి చవితి నిర్వాహకులతో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నంచి జరిగే చవితి వేడుకలు ఆయా ప్రాంతాల్లో ప్రశాంతంగా జరగాలన్నారు. భక్తిశ్రద్ధలతో స్వామిని కొలవాలన్నారు. పండగ పేరుతో అల్లర్లు, గొడవలు వద్దన్నారు. హద్దు మీరితే చర్యలు ఉంటాయన్నారు. కచ్చితంగా నియమ నిబంధనలు పాటించాలని ఆయన తెలిపారు.

ముస్తాబవుతున్న మండపాలు

ఐరాల: మండలంలో వినాయక చవితి సందడి నెలకొంది. వాడవాడలా చవితి పందిళ్లు సిద్ధమవుతున్నాయి. విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. చవితి ఉత్సవాలకు గ్రామాల్లో చురుగ్గా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 27న వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆలయాల వద్ద పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రంలోని పీఎస్ అగ్రహారం, బజారు వీధి, అరుణానగర్ కాలనీ, వైఎస్ గేటు, వారపుసంత వద్ద ఉన్న గణపతి ఆలయం తదితర ప్రాంతాల్లో భారీ గణనాథుడి విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. పందిళ్ల అలంకరణ, విద్యుత్‌దీపాల ఏర్పాటు వంటి పనులు జరుగుతున్నాయి.

ప్రతి గడపకు కూటమి మోసాలను తీసుకెళ్దాం

- చెర్లోపల్లిలో బాబు ష్యూరిటీ
  -మోసం గ్యారెంటీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన మోసపూరిత హామీలను గడపగడపకు తీసుకెళదామని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జయపాల్, జెడ్పీటీసీ ఎంఎస్ బాబునాయుడు, నాయకులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. చిత్తూరు మండలం చెర్లోపల్లి పంచాయతీలో ఆదివారం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా..తప్పుడు హామీలను కప్పి పుచ్చుకునేందుకు అరాచకాలు సృష్టిస్తోందని దుయ్యబట్టారు. సూపర్‌సిక్స్ అంటూ పూర్తిగా ప్రజలను మభ్యపెట్టిందన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ ఆవిష్కరణ, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాన్ని వినిపించారు.

మట్టి గణపయ్యే.. మనకు హితం


వినాయక విగ్రహానికి పూజలు చేసి, మొక్కుతున్న మహిళలు

అనర్థాలు అనేకం

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు విషతుల్యమైన అనేక రంగులు వేస్తున్నారు. వీటిలో లెడ్, క్యాడ్మియం, కాపర్ క్రోమియం, మెర్క్యురీ తదితర హానికరమైన రసాయనాలు ఉంటాయి. ఆ పదార్థాలు నీటిలో కరగకపోగా వాటి నుంచి వెలువడే విషతుల్యాలు నీటిలో పేరుకుపోతాయి. రంగులు నీటిని కలుషితం చేస్తున్నాయి. రసాయనాలు కలిసిన నీరు జలచరాల ఉనికిని ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ నీటిలో పెరిగిన చేపలు తదితర జలచరాలు తినడంతో క్యాన్సర్ వంటి రోగాలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు సూచిస్తున్నారు.


బంక మట్టితో చేసిన గణేశుడి విగ్రహాలు

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు ముప్పు

పాలసముద్రం: సకల గణాలకు అధినాయకుడైన వినాయకుడిని చవితి సందర్భంగా పూజిస్తే సకల విఘ్నాలు తొలగిపోతాయని భక్తులకు నమ్మకం. ప్రతి ఏటా వినాయక చవితికి భారీగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు చవితి పందిళ్లలో ఏర్పాటు చేసి పూజించడం ఆనవాయితీ. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగిస్తే పర్యావరణానికి, తద్వారా మానవాళికి చేటు అని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. మరో వైపు పంచభూతాల్లో ఒకటైన మట్టితో తయారు చేసిన స్వామి విగ్రహాలను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని వేదపండితులు చెబుతున్నారు హానికర రసాయనాలతో రూపొందే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు ఏ మాత్రం సమ్మతం కాదంటున్నారు. ఈ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల తయారీకి గంగాధరనెల్లూరు నియోజకవర్గానికి పలువురు కళాకారులు విచ్చేయడం పరిపాటి. పలు చోట్ల ఇతర రాష్ట్రాల నుంచి కళాకారులు ప్రతి ఏటా ఇక్కడికి చేరుకుని విగ్రహాలను రూపొందించి, విక్రయిస్తుంటారు. చవితికి నెల రోజుల ముందే విగ్రహాలను ఎంపిక చేసుకుని, అడ్వాన్సులు ఇచ్చేస్తారు.

మట్టి ప్రతిమలే మేలు

చెరువులు, కాలువల్లో దొరికే బంకమట్టితో గణపతి ప్రతిమలు రూపొందించి ఆ విగ్రహాలను పూజల అనంతరం నీటిలో నిమజ్జనం చేయాలి. ఈ మట్టి విగ్రహాలు కాలువలు, వాగుల్లో నిమజ్జనం చేయడంతో సులభంగా ప్రతిమ నీటిలో కరిగిపోవడంతో పాటు బంకమట్టి వలన నీటికి ఔషధ గుణాలు కలుగుతాయని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

అవగాహన ఉన్నా..

మట్టి విగ్రహాలనే పందిళ్లలో ఏర్పాటు చేసి పూజించాలని కొన్ని ఏళ్లుగా స్వచ్ఛంద సంస్థలకు చెందిన సభ్యులు భక్తులకు సూచిస్తున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను ఉపయోగించడంతో కలిగే అనర్థాలను వివరించడంలో సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటున్నాయి. పోలీసులు కూడా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో మార్పు మాత్రం రావడంలేదు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి


పీఓపీ విగ్రహాలకన్నా మట్టి బొమ్మలు శ్రేష్ఠం. రసాయనాలతో తయారు చేసే విగ్రహాలను చెరువుల్లో పడవేయడంతో ఆ నీటిని పశువులు తాగి వ్యాధులు బారినపడతాయి. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలు వాడడం మంచిది.
–స్వామిరాజు, రిటైర్డ్ హెచ్‌ఎం, రాచపాళెం

మట్టి విగ్రహాలు శుభప్రదం


మట్టితో చేసిన వినాయకుల విగ్రహాలను పూజించడం శుభప్రదం. మట్టి పంచభూతాల్లో ఒకటి. వినాయకుడు పృథ్వీమయం. అందుకే భూమిలో లభించే పట్టితోనే ఆయన ప్రతిమను తయారు చేసి పూజించాలి. మట్టితో తయారు చేసిన విగ్రహాలు నిమజ్జనం చేయడంతో అది వెంటనే నీటిలో కరిగిపోతుంది.
– అనురేఖ, సర్పంచ్, ఆముదాల

పర్యావరణానికి హాని ఉండదు


మట్టితో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ఎటువంటి హానీ జరగదు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలతో చర్మ సంబంధిత వ్యాధులతో పాటు, శ్వాసకోశ, ఊరిపితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
–డాక్టర్ మోహన్‌క్రిష్ణ, వైద్యాధికారి

మట్టి విగ్రహాలే మేలు


మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదాం. గత కొన్ని సంవత్సరాలుగా ఈ విషయంపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అయితే ప్రజల్లో ఆశించిన స్థాయిల్లో ప్రజల్లో మార్పు రావటం లేదు.
– అరుణకుమారి, తహశీల్దార్, పాలసముద్రం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వినియోగించడంతో మనకు తెలియకుండానే పర్యావరణానికి హాని చేస్తుంది. నిమజ్జనం సమయంలో విగ్రహానికి వేసిన రసాయనాలు నీటితో కలిసి అనేక జీవరాశులు మృత్యువాత పడుతున్నాయి.
–ఎస్.సుశీల, ఎకనమిక్స్ అధ్యాపకురాలు

పర్యావరణాన్ని పరిరక్షించాలి


మట్టి విగ్రహాలతో అందరికీ మంచి చేకూరుతుంది. అందరూ ఐక్యంగా ఉండి సాధ్యమైనంత వరకు ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాల సంఖ్య తగ్గించాలి. మట్టితో తయారు చేసిన గణనాథుల బొమ్మలకే పూజలు చేపట్టాలి.
–చిన్నరెడ్డప్ప, ఎస్ఐ, పాలసముద్రం

వికలాంగుడిపై దాడి.. కేసు నమోదు

గంగాధర నెల్లూరు: మండలంలోని చిన్న వేపంజేరిలో వికలాంగుడిపై ఒక వ్యక్తి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిన్నవేపంజేరికి చెందిన హరిప్రసాద్ వికలాంగుడు. అతను నాయీ బ్రాహ్మణుడు. శుభ, అశుభ కార్యక్రమాలు చేస్తుంటాడు. అతని తీరు సరిగా లేదు. గ్రామస్తులతో దుర్భాషలాడుతూ వుంటాడు. గ్రామంలో శుభ కార్యక్రమాలకు, అశుభ కార్యక్రమాలకు తనను తప్ప వేరేవాళ్లను తీసుకురాకూడదని చెబుతూ ఉంటాడు. అంతేగాక గ్రామంలో పలువురి నుంచి డబ్బు తీసుకుని తిరిగి ఇవ్వలేదు. అడిగిన వారిపై తీవ్ర దుర్భాషలాడడంతోపాటు బెదిరింపులకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆనందరెడ్డి సమీప బంధువుల కర్మక్రియలకు హరిప్రసాద్‌ను పిలవకుండా వేరే వ్యక్తిని తీసుకు వచ్చాడు. హరిప్రసాద్ గ్రామస్తులతో గొడవకు దిగాడు. ఈ సందర్భంగా ఆనందరెడ్డి ఆవేశానికి లోనై హరిప్రసాద్‌పై చేయిచేసుకున్నాడు. దీంతో హరిప్రసాద్ జీడీ నెల్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అంతేగాక హరిప్రసాద్ తన ద్విచక్ర వాహనంపై ప్రెస్ స్టిక్కర్ కూడా వేసుకుని బెదిరింపులకు పాల్పడుతున్నాడని గ్రామస్తులు తెలిపారు. దీనిపై సీఐ శ్రీనివాసంతి వివరణ ఇస్తూ బాధితుడు హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. గ్రామస్తులతో విచారించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

పుత్తూరు: పట్టణంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని కనిపించకుండా పోయిన ఘటన చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గేట్‌పుత్తూరుకు చెందిన జోషువలారెన్స్, అనుప్రియ దంపతుల కుమార్తె పుత్తూరులోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్మీడియట్ తొలి ఏడాది చదువుతోంది. శనివారం కుమార్తె కళాశాలకు వెళ్లకపోవడంపై తల్లి మందలించింది. దీంతో ఉదయం 10.30 గంటలకు బయటకు వెళ్లిన విద్యార్థిని తిరిగి ఇంటికి రాలేదు. వీవర్స్ కాలనీకి చెందిన శరవణన్ కుమారుడు జ్యోతిప్రసాద్ తన కుమార్తెను తీసుకెళ్లి ఉంటాడని అనుప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



బాధిత కుటుంబసభ్యులతో మట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, వాసుదేవరెడ్డి ఇంటి వద్ద మాజీ మంత్రి ఆర్కే రోజా

నిండ్ర: మండలంలోని కావునూరు గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యదర్శి బాలసుబ్రమణ్యం కుమారుడు గిరిబాబు వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వారి కుటుంబాన్ని మాజీ మంత్రి ఆర్కే రోజా ఆదివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. గిరిబాబు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ దీప, జెడ్పీటీసీ సభ్యులు పరందామ, వైస్ ఎంపీపీ శుభా, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, నాయకులు మునికృష్ణరెడ్డి, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేటలో..

వడమాలపేట(పుత్తూరు): వడమాలపేట మండలం బుట్టిరెడ్డికండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకులు పి.వాసుదేవరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం గ్రామంలో జరిగిన కర్మక్రియల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి సానుభూతి వ్యక్తం చేశారు. వడమాలపేట మండల వైఎస్ఆర్ సీపీ కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి అనారోగ్యం బారినపడి, హాస్పిటల్‌లో చికిత్స తీసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్నారు. విషయం తెలుసుకొన్న ఆర్కే రోజా పత్తిపుత్తూరులోని ఆయన ఇంటికెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఎనమలపాళెం గ్రామానికి వెళ్లి వైఎస్ఆర్ సీపీ కార్యకర్త మునిరాజ్ తల్లి అనారోగ్యంతో బాధపడుతుంటే వెళ్లి పరామర్శించారు. ఆమె వెంట పలువురు వైఎస్ఆర్ సీపీ నాయకులు ఉన్నారు.

అదుపు తప్పితే అంతేసంగతులు


వర్షానికి దెబ్బతిన్న బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహదారి

పాలసముద్రం: మండలంలోని పుల్లయ్యగుంట సమీపంలోని జాతీయ రహదారి వర్షపు నీటికి దెబ్బ తినింది. ఈ రోడ్డులో చిత్తూరు–బలిజకండ్రిగ బస్సు సర్వీసులు 30 నిముషాలకు ఒకటి చొప్పున తిరుగుతూ ఉంటాయి. కర్ణాటక ఆరు బస్సులు వున్నాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు నడుస్తున్నాయి. వర్షపు నీటికి రోడ్డు దెబ్బతినడంతో బస్సు నడిపేటప్పుడు డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ఏమాత్రం అదుపుతప్పితే అంతే సంగతులని, కొత్తగా ఈ రోడ్డు గుండా వచ్చే ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు ఇక్కడ కల్వర్టు నిర్మిస్తే రోడ్డు దెబ్బతింటుందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షానికి రోడ్డు దెబ్బతినకుండా కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చండి సారూ..!


అధికారులు మార్చాల్సిన రవి భూమిలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్


నరసింహపురంలో ఇంటికి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ పెట్టడానికి వేసిన దిమ్మె

పాలసముద్రం: తన సొంత భూమిలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని మండలంలోని నరసింహపురం గ్రామానికి చెందిన రైతు రవి కోరుతున్నాడు. తనకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ లేకపోయినా అధికారులు తన భూమిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని పేర్కొన్నాడు. తన పొలంలోకి ట్రాన్స్‌ఫార్మర్ పక్క నుంచే వెళ్లాల్సి వస్తోందని, నెల క్రితం రెండు మేకలు విద్యుత్ షాక్‌తో మృతిచెందాయని వాపోతున్నాడు. మనుషులు కూడా షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోక ముందే ట్రాన్స్‌ఫార్మర్‌ను వేరొకచోటుకు మార్చాలని రైతు కోరుతున్నాడు. అదేవిధంగా నరసింహపురం గ్రామానికి చెందిన మురుగన్ ఇంటికి ఆనుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని గ్రామస్తులు తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరొకచోట ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ముగిసిన శ్రీకానగలమ్మ కొలుపు


విశేషాలంకరణలో అమ్మవారు

కార్వేటినగరం: మండల కేంద్రమైన కార్వేటినగరంలోని శివాలయం వీధిలో ఉన్న శ్రీకానగలమ్మ కొలుపు ఉత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని వేకువ జామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం కొలుపులో భాగంగా హరికథా కాలక్షేపం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ఉభయదారులు సమర్పించిన పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో అలంకరించి ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చారు. బాణసంచా పేలుళ్లు, మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ఉదయం మహిళా భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అధ్యక్షుడు గురుమూర్తి అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

గుడిపాల: వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా అనుమతులు పొందాలని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానా కట్టాల్సిన పనిలేదన్నారు. గణేష్ ఉత్సవ్ డాట్ నెట్‌లో లాగిన్ అయి పూర్తి చిరునామా, ఫోన్ నంబర్లు, మండపం ఏర్పాటు వివరాలు నమోదు చేసి దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. అనుమతి పొందిన వారి మొబైల్‌కు క్యూఆర్ కోడ్ వస్తుందని తెలిపారు. ఆదివారం బొమ్మసముద్రం క్రాస్ వద్ద వినాయక మండపాలను ఏర్పాటు చేస్తున్న వాటిని ఆయన తనిఖీ చేశారు.

పంట మార్పిడితో ప్రయోజనాలు అనేకం


టీవీ కండ్రిగ వద్ద పొలం దున్నుతున్న రైతు


నాటుకు సిద్ధంగా ఉన్న వరి పొలం

- భూసారం పెరిగి అధిక దిగుబడులు
- రసాయనాల ఖర్చుల భారం తగ్గుదల
- తెగుళ్లు, చీడపీడల నుంచి రక్షణ

నగరి: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రైతులు పొలాలు దున్ని పంటలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో 7,704 మంది రైతులు 15,723 ఎకరాల పంటను సాగు చేస్తున్నారు. అయితే ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడంతో భూములు నిస్సారంగా మారి వ్యవసాయంలో ఆశించినంతగా ఫలితాలు ఉండడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో రైతులు పంట మార్పిడి పద్ధతులు అవలంబిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పంట మార్పిడితో పంటల దిగుబడి పెరగడమే కాకుండా భూమి కూడా సారవంతమవుతుంది. ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడం ద్వారా పంట దిగుబడులు తగ్గడమే కాకుండా భూమి నిస్సారవంతంగా మారి తెగుళ్లు, చీడపీడల సమస్య కూడా ఎక్కువగానే ఉంటుంది. ముఖ్యంగా పంట మార్పిడిలో భాగంగా నేలంతా కప్పేలా ఉండే పంటలను ఎంపిక చేసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. ఇలా చేయడంతో పంటలో కలుపు మొక్కలు ఎక్కువగా రాకుండా ఉంటాయి. అలాగే నేల భౌతిక స్థితిలో కూడా మార్పు వస్తుంది. అలాగే భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి వృద్ధి చెంది చీడపీడలు దూరమవుతాయి. ఫలితంగా పంటల రక్షణకు ఉపయోగించే రసాయన ఎరువుల ఖర్చు కూడా తగ్గుతుంది.

భూమికి మేలు చేసే పంటలు

పంటల మార్పిడిలో భాగంగా కందులు, మినుము, సజ్జ, పెసలు, ఉలవలు వంటి వివిధ రకాల పంటలు సాగు చేయడంతో వాటి వేర్లు భూమి నుంచి పోషకాలను సులభంగా తీసుకుంటాయి. కొంత మేర నీటి ఎద్దడిని కూడా తట్టుకుంటాయి. ఈ పంటల వేరు మొదళ్లు నత్రజనిని స్థిరీకరిస్తాయి. ఈ పంటలు సాగు చేయడంతో చాలా వరకు రాలిన ఆకుల రూపంలో సేంద్రీయ ఎరువు లభిస్తుంది.

తెగుళ్లు, చీడపీడల నివారణ

ప్రతి ఏటా ఒకే రకమైన పంటలు సాగు చేయడంతో కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు పంటను ఆశించి వృద్ధి చెందుతాయి. దీని వలన పంట దిగుబడి కూడా చాలా వరకు తగ్గిపోతుంది. ఈ క్రమంలో ఏటా సాగు చేసే పంటను కాకుండా మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు వరుసగా వరి పంట సాగు చేయకుండా పప్పు దినుసులు, నువ్వులు వంటి పంటలు సాగు చేసుకుంటే మేలు జరుగుతుంది. మినుములు, వేరుశనగ తదితర పంటలను లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, రాగులు తదితర ఆరుతడి పంటలతో మార్పు చేయాలి. వరి వేసే పొలానికి ముందుగా జనుము వేస్తే సేంద్రీయ ఎరువుగా తయారై పంటకు మంచి దిగుబడి ఉంటుంది. మొత్తంగా రైతులు పంట మార్పిడి వ్యవసాయం చేయడం లాభ దాయకంగా ఉంటుంది.

పంట మార్పిడితో అధిక దిగుబడి


పంటల మార్పిడితో దిగుబడి పెరుగుతుంది. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఉలవలు, రాగులు సాగు చేస్తే భూమి సారవంతంగా మారుతుంది. అలాగే భూమిలో జనుము వేసి బాగా దున్నితే సేంద్రియ ఎరువు తయారవుతుంది. ప్రస్తుతం మార్కెట్‌లో రాగులు, మినుములు, సజ్జ వంటి పంటలకు మంచి గిరాకీ ఉన్నందున ఈ పంటలు సాగు చేసుకోవచ్చు.
– రాఘవేంద్రయాదవ్, ఏఓ, నగరి మండలం

తెలుగు తేజం పురస్కారానికి కరణం గిరిబాబు


కరణం గిరిబాబు

కార్వేటినగరం: తెలుగు తేజం పురస్కారానికి కార్వేటినగరానికి చెందిన కరణం గిరిబాబుకు ఆహ్వానం అందింది. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ జాతీయ, సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసే కవులను పురస్కారాలతో సత్కరిస్తోందని తెలిపారు. ఈ క్రమంలోనే శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తనతోపాటు చిత్తూరు జిల్లాలో కరణం శివప్రసాద్, కరణం పురుషోత్తం, కరణం విమల, పోటూరు జగన్నాథం, కొత్తకోట్ల గణేష్, కోటాగరం వెంకటేష్‌ను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ నెల 31న పల్నాడు జిల్లా నరసరావుపేటలో నిర్వహించనున్న తెలుగు సాహితీ సంబరాల్లో తెలుగు తేజం అవార్డు అందజేయనున్నట్టు తెలిపారు.